

నెలాఖరు వరకూ ప్రత్యేక రైళ్లు పొడిగింపు

రైల్వే డిసిసి సభ్యులు జక్కంపూడి కుమార్

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లను ఈ నెలాఖరు వరకూ పొడిగించినట్లు రైల్వే డిసిసి సభ్యులు జక్కంపూడి కుమార్ తెలిపారు. ప్రతి ఆదివారం నడిచే నరసాపురం - హైదరాబాద్ - నరసాపురం ఎక్స్‌ప్రెస్ ఈనెల 31వ తేదీ వరకూ పొడిగించారు. పూర్ణ - తిరుపతి - పూర్ణ ఈనెల 25వ తేదీ వరకూ పొడిగించారు. సికింద్రాబాద్ - తిరుపతి - సికింద్రాబాద్ ఈ నెల 25వ తేదీ వరకూ, కాకినాడ టౌన్ - లింగంపల్లి - కాకినాడ టౌన్ ఈనెల 30వ తేదీ వరకూ పొడిగించారని చెప్పారు.

మిచౌంగ్ కల్లోలం..

- జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు
- ఆందోళనలో అన్నదాత
- జలమయమైన రహదారులు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఆక్వా రైతులు ఉక్కిరిబిక్కిరి
- రెండు రోజులు పాఠశాలలకు సెలవు ప్రకటించిన కలెక్టర్
- తుపాను జిల్లా ప్రత్యేక అధికారిగా కన్నబాబు నియామకం

మిచౌంగ్ తుపాను జిల్లాపై తీవ్ర ప్రభావం చూపింది. ఈదురుగాలులతో కూడిన ఎడతెరిపిలేని కుండపోత వర్షం జిల్లా అంతటా కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. అన్నదాతల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఆక్వా రైతులు అకాల వర్షాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తుపాను దృష్ట్యా జిల్లా కలెక్టర్ రెండు రోజుల పాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. తుపాన్ ప్రభావిత జిల్లా అధికారిగా ప్రభుత్వం కన్నబాబును నియమించింది.



పోడూరు : నీట మునిగిన వరిచేలు

ప్రజాశక్తి - భీమవరం

వాతావరణ మార్పులు జిల్లా వాసుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మిచౌంగ్ తుపాను ప్రభావంతో రెండు రోజుల నుంచి ఈదురుగాలులు బలంగా వీచాయి. ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం సోమవారం రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. రోజువారి పనులు చేసుకునే కూలీలు, కార్మికులు, సామాన్య ప్రజానీకం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు వంటి ప్రధాన పట్టణాల్లో రహదారులు జలమయమయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. భీమవరంలోని మూడు అండర్ టెన్నల్‌లో వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తబస్టాండ్, పాత బస్టాండ్ సెంటర్లు, బొంబాయి స్వీట్, ప్రకాశంచౌక్, గాంధీచౌక్, అంబేద్కర్ సెంటర్ , హౌసింగ్ బోర్డ్ కాలనీ, జువ్వలపాలెం రోడ్లు సైతం నీటమునిగాయి.

ముప్పులో లక్షా 40 వేల ఎకరాలు

అకాల వర్షాలతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. మూడు రోజుల నుంచి వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పంటను రక్షించుకునేందుకు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 2 లక్షల 11 వేల ఎకరాల్లో సాగు చేపట్టిన రైతులు లక్షా 40 వేల ఎకరాల్లో కోతలు కోయాల్సి ఉంది. కుండపోత వర్షానికి పంటంతా నేలమట్టం కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు ఇలానే వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే మాసూళ్లు పూర్తిచేశారు. ధాన్యం కళ్లాల్లోనే ఉంది. ఆకు కూరలు, కూరగాయల రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది.

ఆక్వా రైతులు ఉక్కిరిబిక్కిరి

తుపాన్ దాటికి ఆక్వా రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వర్షాల వల్ల ఆక్వాచెరువులో ఆక్సిజన్ శాతం ఏమాత్రం పడిపోయినా రొయ్యలు దెబ్బతినే ప్రమాదం ఉంది. జిల్లాలో సుమారు లక్షా 20 వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. నాసిరకం సీడ్ కారణంగా విబ్రియాసిస్, నైట్ కట్, వైట్ ఫికల్, ఇహెచ్‌పి వంటి వ్యాధులు వెంటాడుతున్నాయి.

పాఠశాలలకు సెలవు ప్రకటించిన కలెక్టర్

తుపాన్ దృష్ట్యా జిల్లాలోనీ అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, విద్యాసంస్థలకు సోమవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సెలవు ప్రకటించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇళ్లకే పరిమితమయ్యారు. మంగళవారం కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని విద్యాసంస్థలన్నీ ఉత్తర్వులను పాటించి పాఠశాలలను మూసి ఉంచాలని తెలిపారు.

జిల్లాలోని తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు రెండు మండలాల్లోని 12 గ్రామాలను తుపాన్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించడం జరిగిందని, వీటితోపాటు



పాలకొల్లు :రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

వర్ష ప్రభావంతో పాలకొల్లు, పాలకోడేరు, భీమవరంలో కూడా కొన్ని లోతట్టు ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 1.40 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. బలమైన ఈదురు గాలులు, వర్షాలు కారణంగా ఎక్కడైనా చెట్లు పడిపోతే ట్రాఫిక్ అంతరాయం లేకుండా వెంటనే తొలగించేందుకు ఆర్ అండ్ బి, పంచాయతి రాజ్, అగ్నిమాపక శాఖల సిబ్బందితో ఒక టీం ఏర్పాటు చేసి మండల తహశీల్దార్ కార్యాలయంలో ఉంచినట్లు తెలిపారు.

అంధకారంలో గ్రామాలు..

ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో జిల్లాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల చెట్లు, చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సోమవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రజలు అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.



యలమంచిలి : నేలకొరిగిన వరిచేను

తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండడంతోపాటు, విద్యుత్ వినియోగదారులు, రైతులు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాన్ సమయంలో ఇంటి గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్‌మోడ్‌లో ఉంచాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయినా, విద్యుత్ వైర్లు తెగిపడినా వెంటనే విద్యుత్ కార్యాలయానికి గాని కంట్రోల్ రూమ్‌కు గాని తెలియజేయాలని తెలిపారు.

జిల్లా ప్రత్యేకాధికారిగా కన్నబాబు

తుపాన్ ప్రభావిత జిల్లాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. దీనిలో భాగంగా జిల్లా ప్రత్యేక అధికారిగా రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ కన్నబాబును ప్రభుత్వం నియమించింది.

ఉండి : మిచౌంగ్ తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురిశాయి. ఫలితంగా చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్ష ప్రభావంతో రోడ్లన్నీ నిండిపోయి చెరువులుగా మారాయి.

పోడూరు : ఆదివారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో పంట పొలాలు నేలకొరిగాయి. తుపాను ప్రభావం ఇంకా రెండు రోజులపాటు ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో రైతులు చెందుతున్నారు. వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి.

కాళ్ల : పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలతో వరి చేలు నేలనంటాయి. మండలంలో 3,878 ఎకరాల్లో సార్వా సాగవుతోంది. ఇప్పటివరకూ 600 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత సీజన్లో పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని, తుపాన్ ప్రభావంతో నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నాయకులు ఆదుకోవాలని రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు.

ఆక్వా రైతు ఆందోళన

తుపాను నేపథ్యంలో ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొంది. రెండు రోజులుగా వర్షాలు పడడంతో చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ కొరత ఏర్పడింది. రొయ్యలు మృత్యువాత పడే ప్రమాదం ఉందని వారు దిగాలు చెందుతున్నారు. మండలంలో సుమారు 26 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. రొయ్యలు పట్టుబడికి వచ్చే సమయానికి తుపాన్లు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయని ఆక్వా రైతులు వాపోతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టడంతో ప్రతికూల వాతావరణం నుంచి బయటపడాలని రేయింబవళ్లు చెరు వుల వద్దే కాపలా ఉంటున్నారు. ఇప్పటికే ఎకరానికి సుమారు రూ.1.5 లక్షలు పెట్టుబడి పెట్టారు.

ఆచంట : వాతావరణం రైతులను ఉరుకులు పరుగులు పెట్టిస్తోంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికందే సమయంలో ప్రకృతి విలయతాండవం చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకూ ఏకధాటిగా వర్షం కురవడంతో రైతులు కలవర పడుతున్నారు. పంటను కాపాడుకోవడానికి రాశు లపై బరకాలు, కొబ్బరి ఆకులు, గడ్డి కప్పుతూ కాపాడుకుంటున్నారు. మండలంలో 10,600 ఎకరాల్లో సార్వాసాగు చేపట్టగా ఇప్పటివరకు సుమారు 500 ఎకరాల వరకూ కోతలు పూర్తయినట్లు వ్యవసాయ విస్తరణాధికారి నాగరాజు తెలిపారు. 350 ఎకరాల్లో వరిచేలు నేలకొరిగినట్లు తెలిపారు.

పాలకొల్లు : పాలకొల్లులో సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. దీనికితోడు చలిగాలులు వీస్తున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. వర్షంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

పాలకొల్లు రూరల్ : ఆదివారం రాత్రి నుంచే మండలంలో ఎడతెరిపి లేని వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రైతులు ఆందోళనలో పడ్డారు. మంగళవారం కూడా వర్ష ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు.

మొగల్తూరు : ఆదివారం రాత్రి నుంచి మండలంలో వర్షం కురుస్తోంది. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయి మడుగులను తలపించాయి. పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారి పైన వర్షపు నీరు నిలిచిపోయింది.

యలమంచిలి : తుపాను నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో వరిచేలు నేలనంటాయి. చేతికొచ్చిన పంట కళ్లదుటే నేలనంటడంతో వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా 6 వేల ఎకరాల్లో రైతులు వారి సాగు చేశారు. మరో పది రోజుల్లో మాసూళ్లు అయ్యే పరిస్థితి ఉండగా, తుపాను సృష్టించిన బీభత్సానికి నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంపర్రు, చింతదిబ్బ, కాంబోట్లపాలెం, శిరగారపల్లి, మేడపాడు, నేరేడుమిల్లి గ్రామాల్లో వరి చేలను వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బొంతు కర్ణారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట రైతు నాయకులు జిఎస్.బాబు, జడ్డు బదరీ నారాయణ, జై పరంకుశం ఉన్నారు.

భీమవరం రూరల్ : మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్ డిమాండ్ చేశారు. భీమవరం మండలం కొవ్వాడ-అన్నవరంలో పంట పొలాలను, వర్షంలో ఒబ్బిడి చేసుకున్న ధాన్యం రాశులను రైతు సంఘం, సిపిఐ ప్రతినిధి బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, జిల్లా సమితి సభ్యులు సెనపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెనుగొండ : తుపాను నేపథ్యంలో భారీ వర్షాలు కురవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రయాణికులు, పేపర్‌బాయ్, పాల వ్యాపారస్తులు రోజువారి పని నిమిత్తం వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.



ఎగసి పడుతున్న అలలు

ఎగసి పడుతున్న సముద్రపు కెరటాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్, కెపిపాలెం సౌత్ వద్ద సముద్రం ప్రమాదకరంగా మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో అలలు ఉధృతంగా ఎగిసిపడుతున్నాయి. దీనికితోడు సముద్ర పోటు నేపథ్యంలో నీరు ముందుకొచ్చింది. సముద్ర తీరానికి ఎవరూ వెళ్లకుండా పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు.



రైతులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాం

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తణుకు రూరల్

తుపాన్ నేపథ్యంలో కోసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన రైస్ మిల్లులకు తరలించినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఇరగవరం మండలంలో గోటేరు, కత్తవపాడు, అత్తిలి మండలంలో మంచిలి, కంచుమర్రు, స్కిన్నెరపురం, ఈడూరు, కొమ్మర, పాలూరు గ్రామాల్లో మంత్రి కారుమూరి పర్యటించి, రైతులతో మాట్లాడారు. ధాన్యంలో తేమశాతం తేడాను పరిగణలోకి తీసుకొని రైతుకు, మిల్లర్లకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు. రైతులు పంపిన ధాన్యాన్ని మిల్లర్లు త్వరితగతిని అన్ లోడింగ్ అయ్యేలా చూడాలన్నారు. రైతులకు అండగా ప్రభుత్వం ఉందని, రైతులు అధైర్య పడొద్దని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇతర జిల్లాల రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రెండు జిల్లాల్లోని మెజార్టీ రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించారన్నారు. కృష్ణా జిల్లాలో రైస్ మిల్లులు తక్కువగా ఉండడంతో అక్కడ ధాన్యాన్ని పక్కన ఉన్న పల్నాడు, బాపట్ల ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరెక్టర్ పెనుమత్స సుబ్బరాజు, కొత్తపాడు సొసైటీ అధ్యక్షులు పెనుమత్స రామభద్రరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

సోమవారం మండలంలోని పెదమైనవానిలంక డిజిటల్ భవనం, పిఎంలంకలో సముద్రం కోతకుగురైన ప్రాంతాన్ని, చినమైనవానిలంక తుపాను షెల్టర్, వేములదీవి (తూర్పు) తుపాన్ షెల్టర్, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్, కాలనీని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, వివిధ శాఖల అధికారులతో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానికులతో మాట్లాడారు. లోతట్టు ప్రాంత ప్రజలు అధికారులు సూచనల మేరకు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలన్నారు. గర్భిణులను వెంటనే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రుల్లో చేర్పించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రంలో లోటుపాట్లు రాకుండా చూడాలన్నారు. నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. సముద్ర తీర ప్రాంతానికి ఎవరూ వెళ్లకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

తుపాను కారణంగా జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆమె సోమవారం నరసాపురం సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో జిల్లా ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తుపాను ముందస్తు చర్యలపై సమీక్షించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత్‌అంబరీష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో అత్యవసరంగా 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాల సూచనతో లోతట్టు, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను యుద్ధ ప్రాతిపదికన తరలించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. తీర ప్రాంతాలైన ఆచంట, నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల్లోని అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆమె ఆదేశించారు.

పాలకొల్లు రూరల్: రైతులు ధాన్యాన్ని త్వరితగతిన రైసుమిల్లులకు తరలించాలని, కోతలు కోయని పైరును మరో మూడు రోజుల వరకూ కోయకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని వెలివెలలో బరకాలతో కప్పి ఉంచిన ధాన్యం రాశులను, కోతదశలో ఉన్న పంటలను జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం పలు సడలింపులు ఇచ్చిందన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ రైతులు తమ ధాన్యాన్ని భద్రపర్చుకోవాలన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

మిచౌంగ్ తుపాను భీభత్సం వల్ల నష్టపోయిన అన్ని పంటల రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మిచౌంగ్ తుపాను వల్ల జిల్లాలోని రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. వరి కోతలు 50 శాతం పూర్తి చేసి మాసూళ్ల పనిలో రైతులు ఉన్నారని తెలిపారు. మరో 50 శాతం వరికోతలు పూర్తి కాలేదని పేర్కొన్నారు. తుపాను వల్ల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణం రైతాంగానికి బరకాలు, సంచులు అందజేయాలని కోరారు. తడిచిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి మద్దతు ధరకే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందజేయాలని కోరారు. కౌలురైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'స్పందన'కు 8 ఫిర్యాదులు

ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - భీమవరంరూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన'కు ఎనిమిది ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ తెలిపారు. సోమవారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి బాధితులు జిల్లా ఎస్‌పికి తమ సమస్యలు వివరించి అర్జీలు అందించారు. ఎస్‌పి బాధితులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలీస్ అధికారులకు ఫోన్ చేసి చట్టపరంగా ప్రతి ఫిర్యాదుపై విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.




ఫిర్యాదును స్వీకరించి పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి రవిప్రకాష్

రైతులకు అండగా ప్రభుత్వం : ఎంఎల్‌ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రైతులకు అండగా తమ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ ప్రభావం వల్ల ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు పంట నష్టపోకుండా వ్యవసాయ అధికారులు, రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది వారికి అండగా ఉండాలని సూచించారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వ్యవసాయ శాఖ ఎడి చింతల శ్రీనివాసరావుతో ఫోన్లో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ గ్రంధి

ఆచంట: తుపాన్ ప్రభావం వల్ల రైతులు నష్టపోకుండా వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సూచనలు సలహాలు పాటించాలని తహశీల్దార్ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని ఆచంట, పెనుమంచిలి, ఆచంట వేమవరంలో మిచౌంగ్ తుపాన్ ప్రభావం వల్ల నేలకొరిగిన పంట పొలాలను తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, వ్యవసాయ విస్తరణాధికారి బి.నాగరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలో సుమారు 350 ఎకరాల వరకూ పంట పొలాలు నేలకొరిగాయని ప్రాథమికంగా గుర్తించినట్లు మండల వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు తెలిపారు. పొలాల్లోని మురుగు నీరు బయటకెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ, మండల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రజక వృత్తిదారులు ఐక్యంగా ఉద్యమించడం ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవడం సాధ్యమని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య తెలిపారు. తాడేపల్లిగూడెం అపరాల మార్కెట్ వర్కర్స్ యూనియన్ భవనం వద్ద రెండో రోజు సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురు శేఖర్ ప్రిన్సిపల్‌గా జరిగిన రజకుల అవగాహన చైతన్య తరగతుల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని రజక వృత్తిదారుల దీర్ఘకాల అపరిష్కృత సమస్యలపై చైతన్యం కలిగించడం కోసం ఈ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ చైతన్య తరగతులను తాడేపల్లిగూడెం కార్మిక వర్గ నాయకుడు లింగరాజు మొదటి రోజు క్లాసు, చింతకాయల బాబూరావు, ఎం.భాస్కరయ్య రెండో రోజు క్లాసులో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో రజక వృత్తిదారులకు ఏ ప్రయోజనమూ చేకూరలేదన్నారు. పాలకుల విధానాలను గమనించి రజకులు తగు సమయంలో స్పందించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మడక రాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, రేకులగుంట అంకయ్య పాల్గొన్నారు.

భీమవరంలో నేడు ఎన్నికల పరిశీలకులు పర్యటన

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల రోల్ అబ్జర్వర్, ఐఎఎస్ సెక్రటరీ, ఇండస్ట్రీయల్, కామర్స్ డిపార్ట్‌మెంట్ ఎన్.యువరాజ్ భీమవరంలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం రాత్రి భీమవరం చేరుకుని బస చేస్తారని తెలిపారు. కలక్టరేట్‌లో మంగళవారం ఉదయం పది గంటలకు సమ్మరీ రివిజన్ ఆఫ్ ఫొటో ఎలక్ట్రోల్స్‌పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పక ఈ సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. ఎలెక్టోరల్ రోల్ ఆఫీసర్స్‌తో సమావేశం అనంతరం జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తారని తెలిపారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం రాజమహేంద్రవరం బయలుదేరి వెళ్తారని తెలిపారు.



సెల్ఫ్ రికార్డెడ్ రెయిన్ గేజీ పరికరాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

సెల్ఫ్ రికార్డెడ్ రెయిన్ గేజీ పరికరం పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

భారత వాతావరణ శాఖ సెల్ఫ్ రికార్డెడ్ రెయిన్ గేజీ పరికరాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి పరిశీలించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం కాంపౌండులో భారత వాతావరణం శాఖ సెల్ఫ్ రికార్డెడ్ రెయిన్ గేజీ పరికరాన్ని (వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలిలో తేమ శాతం కొలిచే సాధనం) సోమవారం పరిశీలించారు. వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలిలో తేమ శాతం ఎలా రికారడవుతుంది, రోజుకు ఎన్నిసార్లు పరిశీలించి నమోదు చేస్తారనే సమాచారాన్ని వాతావరణ శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సాధారణ రోజుల్లో మూడు గంటలకు ఒకసారి, తుపాన్ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రతి గంటకు ఒక సారి పరిశీలించి నమోదు చేస్తామని, నమోదు చేసిన రిపోర్టును వాతావరణ కేంద్రాలు చెన్నై, అమరావతి, విశాఖట్నానికి పంపుతామని వాతావరణ శాఖాధికారి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. పకృతి వైపరీత్యాల సమయంలో రిపోర్టును జిల్లా, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలకు త్వరితగతిన పంపించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. వారితో పాటు ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, వాతావరణ శాఖ అధికారి జివి.దొర ఉన్నారు.

భూ హక్కు చట్టం 27/23ను రద్దు చేయాలి

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - తణుకు రూరల్

భూ హక్కు చట్టం 27/23ను రద్దు చేయాలని న్యాయవాదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉభయ జిల్లాల న్యాయవాదుల ఫెడరేషన్ పిలుపులో భాగంగా తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమ వారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉభయ జిల్లాల న్యాయవాదుల ఫెడరేషన్ ఉపాధ్యక్షులు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ భూ యజమానులకు అన్యాం జరిగే చీకటి చట్టం రద్దు చేయాల న్నారు. ఇప్పటివరకు భూ వివాదాలు సివిల్ న్యాయస్థానాల పరిధిలో ఉండి వివాదాలకు పరిష్కారం చేసేవని తెలిపారు. భూ హక్కు చట్టం 27/23 ప్రకారం భూమి నమోదును ల్యాండ్ టైటిలింగ్ అధికారి రికార్డ్స్‌లో నమోదు చేస్తారని, దానిలో ఏమైనా తేడాలు ఉంటే రెండేళ్ల లోపు జిల్లా జాయింట్ కలెక్టర్ ట్రిబ్యునల్‌లో స్తరనురియల్ని ప్రభుత్వం నియమిస్తుందని, భూములను రికార్డు ఏదో అప్పీలు చేసుకోవాలని కొత్త చట్టం తెలియజేసిందని చెప్పారు. నమోదైన వివరాలు ఏ విధంగా భూ యజమానికి తెలియపరచుతారో కొత్త చట్టంలో వివరించలేదని తెలిపారు. చట్టాలపై ఎటువంటి అవగాహన లేని అధికారు లు రాజకీయ ఒత్తిడలకు గురవుతారని, ఈ సందర్భంలో భూ యజమానికి అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌లో సమాచారాన్ని భూ యజమానికి ఏ విధంగా తెలియపరుస్తారో సమాచారం లేదన్నారు. చట్టాన్ని వెంటనే నిలుపుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధతం చేస్తామని చెప్పారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెవివి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ చట్టం రద్దు కోరుతూ న్యాయవాదులు ఈ నెల నాలుగో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు విధులను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. వివిధ రూపాల్లో న్యాయవాదులు తమ నిరసనలను ప్రభుత్వానికి తెలియజేస్తారన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే న్యాయవాదులు భూ యజమానులతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చింతపల్లి నాగేశ్వరరావు, ఎం.మృత్యుంజయరావు, ఎస్.లాజర్, కె.జస్పాల్, హెచ్.నాగార్జున దాస్, సీనియర్ న్యాయవాదులు నండూరి రామ్మోహనరావు, కౌరు వెంకటేశ్వర్లు, కలిదిండి పద్మావతి, అనుకూల రమేష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - తణుకు రూరల్

మండలంలోని పైడిపర్రులో సోమవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన సాధనకుమార్ (23) తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం దువ్వ నుంచి తణుకు వస్తున్న క్రమంలో అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టి కింద పడిపోయాడు. ఆ సమయంలో మరో రోడ్డు మార్గంలో వెళ్తున్న లారీ అతడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కుమార్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. తణుకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించి పెళ్లికి నిరాకరించాడని..

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రేమ పేరుతో మోసపోయిన యువతి మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన బాలే ఇందిరా బిఎస్‌పి పూర్తి చేసి పాలకొల్లులో ఓ మెడికల్ షాపులో పని చేస్తుంది. దొడ్డిపట్లకు చెందిన వలవల సాయి కూడా అదే మెడికల్ షాపులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సాయి మూడేళ్ల నుంచి ఇందిరాను ప్రేమిస్తున్నారని నమ్మించి తీరా పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఇందిరా సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు ఆమెను పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువతికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం : ఎంఆర్‌పిఎస్

ప్రేమ పేరుతో ఇందిరాను మోసగించిన సాయిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి యువతి కుటుంబానికి న్యాయం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సాయి చేతిలో ప్రేమ పేరుతో మోసపోయిన ఇందిరాకు న్యాయం జరిగే వరకు ఆమె తరపున పోరాటం చేస్తామని ఎంఆర్‌పిఎస్ నాయకులు పసుపులేటి చినబాబు, సిర్ర నాగరాజు, దిగమర్తి నాగరాజు, బుంగ జయరాజు అన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మొగల్తూరులో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... మొగల్తూరుకు చెందిన సూర్యనారాయణ (40) ఆదివారం కొత్తగా నిర్మిస్తున్న తన ఇంటిని తడుపుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సూర్యనారాయణ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సూర్యనారాయణ తండ్రి నాంచారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తుపాన్ సహాయక చర్యలకు రూ.2 కోట్లు విడుదల

తుపాన్ ప్రభావిత ప్రాంతాలుగా 12 గ్రామాలు గుర్తింపు

భీమవరం, పాలకోడేరు, పాలకొల్లులో లోతట్టు ప్రాంతాలు గుర్తింపు

ఇళ్లలో నీరు చేరితే రూ.10 వేలు సహాయం

1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

తుపాన్ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంతి తుపాన్ పరిస్థితులు సహాయక చర్యలపై మాట్లాడారు. నరసాపురం, మొగల్తూరు రెండు మండలాల్లోని 12 గ్రామాలను తుపాన్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించినట్లు చెప్పారు. వీటితోపాటు వర్ష ప్రభావంతో పాలకొల్లు, పాలకోడేరు, భీమవరంలో కూడా కొన్ని లోతట్టు ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. గుర్తించిన అన్ని ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను సిద్ధం చేయడంతో పాటు, గర్భిణులను, వృద్ధులను, పిల్లలను తరలించినట్లు చెప్పారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్న మహిళలను నరసాపురం ఏరియా హాస్పిటల్‌లో ఉంచామన్నారు. తుపాన్ రిలీఫ్ చర్యల్లో భాగంగా ప్రభుత్వం రూ.2 కోట్లు విడుదల చేసిందన్నారు. వీటితో పునరావస కేంద్రాల్లో తాగునీరు, భోజనం ఏర్పాట్లు, బాధితులకు నగదు జమ, ఇళ్లల్లోకి నీరు చేరిన వారికి రూ.10 వేలు సహాయం, తదితరాలకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు వాతావరణ మార్పులను గమనించాలని, అవసరమైతే తప్ప ఇంటిని వదిలి బయటికి రావద్దని హెచ్చరించారు. ఇప్పటి వరకు జిల్లాలో 1.40 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ధాన్యంలో 90 శాతం ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేశామన్నారు. మిగిలిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో ఉంచామన్నారు. పునరావాస కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని చెప్పారు. తుపాన్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా మత్స్యశాఖ స్పెషల్ కమిషనర్ కె.కన్నబాబు జిల్లాకు వచ్చారన్నారు. ప్రజలకు సహాయం కోసం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 24/7 పని చేస్తుందని, అవసరమైన వారు కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. డివిజన్ స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రజలు భయాందోళన చెందొద్దు

పునరావాస కేంద్రాలు ఏర్పాటు

రైతులను ఆదుకుంటాం

సముద్ర తీర ప్రాంతంలో చీఫ్ విప్, ఎస్‌పి పర్యటన



సముద్ర తీర ప్రాంతంలో పర్యటిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు, ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం నియోజకవర్గం సముద్ర తీర ప్రాంతమైన పెదమైనవానిలంక, చిన్నమైనవానిలంక, వేములదివి ప్రాంతాలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎస్‌పి యు.రవిప్రకాష్ కలిసి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పెదమైనవానిలంకలో తుపాను కారణంగా ఎగిసి పడుతున్న సముద్ర కెరటాల ఉధృతిని పరిశీలించారు. పెదమైనవానిలంక డిజిటల్ భవనం, చినమైనవానిలంకలో తుపాను షెల్టర్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తుపాను తీరం దాటే సమయంలో బలమైన గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉండి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. తుపాన్ నేపథ్యంలో అధికారులు తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారన్నారు. ఇక్కడ ప్రజలకు తుపానులు కొత్త కాకపోయినా మన ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉన్నందున ప్రజలు అధికారుల సూచనలు, సలహాల మేరకు జాగ్రత్త వహించాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకూడదన్నారురర. తీర ప్రాంత ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్య వేక్షిస్తున్నారని, సిఎం జగన్మోహన్‌రెడ్డి తరచూ జిల్లా యంత్రాంగంతో రివ్యూ చేస్తున్నారని, ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురి కావొద్దని, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు స్థానికంగా ఉన్న పునరావాస కేంద్రాలకు తరలిరావాలని చెప్పారు. అధిక వర్షాల కారణంగా ఏ ఒక్క రైతు నష్టపోకూడదన్న ఉద్దేశంతో ధాన్యం సేకరణలో ప్రభుత్వం పలు సడలింపులు చేసిందన్నారు. ధాన్యాన్ని నచ్చిన మిల్లులకు తరలించుకునే వీలు కల్పించిందన్నారు. సొంత వాహనాలకు జిపిఎస్ లేకపోయినా వినియోగించుకునే అవకాశంతో పాటు ఆన్‌లైన్ ద్వారా ధాన్యం సేకరణకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు, సూచనలు పాటిస్తూ రైతులు తమ ధాన్యాన్ని భద్రపరచుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు రైతులను రైస్ మిల్లర్లు ఇబ్బంది పెడితే వెంటనే కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి తెలియజేయాలని, చర్యలు తీసుకుంటామని చెప్పారు. వారితో పాటు నరసాపురం ఇన్‌ఛార్జి డిఎస్‌పి జిఎస్.పైడేశ్వరరావు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమని నాగరాజు, నరసాపురం జెడ్‌పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

ఆరు పునరావాస కేంద్రాలు ఏర్పాటు

మొగల్తూరు :బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో లోతట్టు ప్రాంతాల ప్రజల రక్షణకు ఆరు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తహశీల్దార్ జి.అనితకుమారి తెలిపారు. పేరుపాలెం నార్త్‌లో రెండు, పేరుపాలెం సౌత్‌లో మూడు, కెపి.పాలెంలో ఒకటి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ పునరావాస కేంద్రాలకు రావాలని ఆమె సూచించారు.

వెదుళ్లపాలెంలో డెంగీ కేసులు లేవు

ఫీవర్ సర్వే నిర్వహించిన డాక్టర్ ప్రతాప్‌కుమార్



డాక్టర్ ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వెదుళ్లపాలెంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం జ్వరాలపై సర్వే నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న నలుగురికి డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహించామని, ఎవ్వరికీ డెంగీ నిర్ధారణ కాలేదని తెలిపారు. గ్రామస్తులకు డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించామన్నారు. ఇటీవల గ్రామంలో జ్వరంతో మరణించిన ఇర్రింకి శంకరం కుటుంబసభ్యులకు డెంగీ కిట్లతో పరీక్ష చేయగా నెగిటివ్ వచ్చిందన్నారు. సీరం కలెక్ట్ చేసి డెంగీ నిర్ధారణ కోసం పరీక్షకు పంపించామని డాక్టర్ ప్రతాప్‌కుమార్ తెలిపారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని వార్డు మెంబర్ మాదు సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. పంచాయతీ సెక్రటరీ వారి దృష్టిలో పెట్టి పారిశుధ్యం చేసేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశామని డాక్టర్ ప్రతాప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, సబ్ యూనిట్ అధికారి కె.రాజ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్లు గోపాలకృష్ణ, దివాకర్‌బాబు, తారక సత్య, సత్తిరాజు, ఎంఎల్‌హెచ్‌పి మార్తమ్మ, ఎఎన్‌ఎంలు రోజాకమల, ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు విజయకుమారి, వెంకటలక్ష్మి, మేరీ ఆశీర్వాదం పాల్గొన్నారు.

రోడ్లు పున:నిర్మించండి సారూ..!

చిన్నపాటి వర్షానికే చెరువులుగా మారిన వైనం

కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోని అధికారులు

అప్పుడప్పుడు టిడిపి, జనసేన నాయకుల హడావుడి



గోతులమయంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - ఉండి

అది పేరుకే జాతీయ రహదారి కాని అడుగడుగునా గోతులమయం. జాతీయ రహదారి 165లో ఉన్న మండల కేంద్రం ఉండిలో సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఆర్ఓబి ప్రాంతంలో రహదారి మొత్తం గుంతలమయంగా మారి తేలికపాటి వర్షానికి చెరువుల్లాగా మారుతున్నాయని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఆ రహదారిలో ప్రయాణించాలంటే నరకప్రాయంగా మారిందని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. రహదారికి మరమ్మతులు గాని పున:నిర్మించడం గాని చేయాలని రెండేళ్లుగా ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థ నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. సెప్టెంబర్ 13వ తేదీన ఉండి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి దృష్టికి పలువురు జాతీయ రహదారి దుస్థితి తీసుకొచ్చారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి రహదారికి మరమ్మతులు చేపట్టాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ సుమారు మూడు నెలలుగా అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలకే విలువ లేదా అని పలువురు విస్మయం చెందుతున్నారు. టిడిపి, జనసేన రాష్ట్ర కమిటీల పిలుపుమేరకు అప్పుడప్పుడు రహదారుల దుస్థితిపై టిడిపి, జనసేన నాయకులు హడావుడి చేస్తున్నప్పటికీ జాతీయ రహదారి దుస్థితికి శాశ్వత పరిష్కారం లభించడం లేదని పలువురు వాపోతున్నారు. మండలంలో గొప్పలు చెప్పుకునే బిజెపి నాయకులు సైతం జాతీయ రహదారి దుస్థితిపై మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ గుంతల రహదారిలో పలు ఆటోలు తిరగబడి ప్రయాణికులు గాయాల పాలయ్యారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఈ రహదారిపై శ్రద్ధ తీసుకుని పున:నిర్మించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ధాన్యాన్ని దగ్గరలో రైస్‌మిల్లుకు తరలించుకోవచ్చు

మండల వ్యవసాయాధికారి బి.సంధ్య

ప్రజాశక్తి - ఉండి


పంట చేతికి వచ్చేసరికి మిచౌంగ్ తుపాన్ బారిన పడి పంట నష్టపోతున్నామని రైతులెవరూ అధైర్య పడొద్దని, ధాన్యాన్ని దగ్గరలోని రైస్ మిల్లులకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని ఉండి మండల వ్యవసాయాధికారి బి.సంధ్య తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో అధికారులు మండలంలోని ఉప్పులూరు, ఆరేడు, కోలమూరు పలు గ్రామాల్లో సోమవారం పర్యటించి రైతులు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ధాన్యం పట్టుబడి సాగిన రైతులు ధాన్యాన్ని దగ్గరలోని రైస్ మిల్లులకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాంన్నారు. పట్టు బడి పట్టిన ధాన్యాన్ని బరకాలు కప్పి జాగ్రత్త పరుచుకోవాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో ఆన్‌లైన్ ద్వారా 4423 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, ఆఫ్‌లైన్ ద్వారా 960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు తెలిపారు.

రైతులకు పలు సూచనలు

ఆచంట (పెనుమంట్ర) : మేము సైతం అంటూ తుపాన్ సమయంలో రైతులకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని పెనుమంట్ర మండల పరిధిలోని అగ్రికల్చర్ అసిస్టెంట్ కృష్ణ గంగాదేవి అన్నారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం క్షేత్రస్థాయిలో రైతులకు భరోసా ఇస్తూ రైతులు పండించిన ధాన్యం భద్రపరచుకోవాలని తగు సూచనలు, సలహాలు అందించారు. ముఖ్యంగా మార్టేరులో అగ్రికల్చర్ అసిస్టెంట్ మండబాక కృష్ణ గంగాదేవి స్థానిక రైతు మేడపాటి నాగేశ్వరరావుకు తగిన సూచనలు ఇవ్వడమే కాకుండా, ఆలమూరులో అగ్రికల్చర్ అసిస్టెంట్ బి.దుర్గాప్రసాద్ ఇలా ప్రతి గ్రామంలో రైతులకు సలహాలు సూచనలు ఇస్తూ రైతుల మన్ననలు పొందుతున్నారు. ఈ సందర్భంగా ఎఒ ఎ జ్యోషిల మాట్లాడుతూ రైతుల నుంచి 500 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందన్నారు. సమయాన్ని బట్టి రైతుల వద్ద ఉన్న ధాన్యం దగ్గర ఉన్న మిల్లులకు రవాణా చేయాలని వివిఎలకు చెప్పినట్లు తెలిపారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకుంటే చర్యలు

ఉండి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డిఎస్‌పి శ్రీనాథ్



రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రీనాథ్

ప్రజాశక్తి - ఉండి

రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ హెచ్చరించారు. సోమవారం ఉండి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే ఉండి పోలీసుస్టేషన్‌ను సందర్శించి రికార్డుల నిర్వహణను పరిశీలించినట్లు చెప్పారు. ఇటీవల మండలంలో దిశ కేసులు నమోదు కావడంతో వాటిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సుమారు నెల రోజుల నుంచి ఖాళీగా ఉన్న ఉండి పోలీసుస్టేషన్ ఎస్ఐ స్థానాన్ని మరో పది రోజుల్లో భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు ట్రైనీ డిఎస్‌పి కఠారి అరవింద్ ఉన్నారు.

జిల్లాలో 1093.4 మి.మీ వర్షపాతం నమోదు

అత్యధికంగా పాలకొల్లులో 135 మి.మీ

ప్రజాశక్తి - భీమవరం

మిచౌంగ్ తుపాన్ నేపథ్యంలో జిల్లాలో వర్షపాతం భారీగా నమోదైంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఐదు గంటల వరకు 1093.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో 36.8 మిల్లీమీటర్ల వర్షపాతం, పెంటపాడులో 30, తణుకులో 48.2, అత్తిలిలో 33.8, గణపవరంలో 29.8, ఆకివీడులో 33, ఉండిలో 37.4, పాలకోడేరులో 56.8, ఇరగవరంలో 63.6, పెనుగొండలో 94, ఆచంటలో 58, పోడూరులో 60, వీరవాసరంలో 60.2, భీమవరంలో 53.8, కాళ్లలో 28.8 మొగల్తూరులో 58.4, నరసాపురంలో 67.6, పాలకొల్లులో 135, యలమంచిలిలో 74.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



మూర్తిని సత్కరిస్తున్న వక్తలు

శృంగవృక్షంలో ఎక్స్‌ప్రెస్ బస్సులకు రిక్వెస్ట్ స్టాప్

ప్రజాశక్తి - పాలకోడేరు

భీమవరం నుంచి నడిపే అమలాపురం, నరసాపురం, వైజాగ్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు శృంగవృక్షం గ్రామంలో రిక్వెస్ట్ స్టాప్ ఇస్తామని భీమవరం ఆర్‌టిసి డిపో మేనేజర్ పివిఎస్ఎన్.మూర్తి ప్రకటించారు. శృంగవృక్షం శ్రీ వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా ఏర్పాటు చేసిన వన సమారాధనలో డిపో మేనేజర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా పుణ్యక్షేత్రాలకు వెళ్లాలనుకున్న వారు తనను సంప్రదిస్తే తక్కువ ప్యాకేజీలో బస్సులు సమకూరుస్తామన్నారు. ఈనాటి పిల్లలు సెల్‌ఫోన్ల వల్ల పక్కదారి పడుతున్నారని, తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, చదువుకే పరిమితం చేయకుండా సాంస్కృతిక రంగాల్లో తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, వాసు, గ్రంధి రాజా, యానాది శెట్టి, కూర్మాల పూర్ణారావు, నరసింహరావు, బ్రహ్మాజీ, కుసుమ గుప్త పాల్గొన్నారు.

దాతలు, స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పంచారామ క్షేత్రమైన శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయానికి కార్తీకమాసం సోమవారం వచ్చే భక్తులకు, యాత్రికులకు అన్న ప్రసాదం, టిఫిన్స్, బాదంపాలు, పాలు, పులిహోర వంటివి అందిస్తున్న దాతలు, స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులు, యాత్రికులకు దాత బాలి ఏడుకొండలు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జోరుగా కుండపోత వర్షంలో సైతం భక్తులు, యాత్రికులకు ఎంఎల్ఎ స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా బాలి ఏడుకొండలును ప్రత్యేకంగా అభినందించారు.